## విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు





# సిద్దిపేట సంగారెడ్డి మెదక్



# కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

కుంటుపడుతున్న కేతకీ ఆలయ అభివృద్ధి

అక్రమ నియామకాలపై దేవాదాయ శాఖకు ఫిర్యాదు చేసినా చర్యలు నిల్

టెండర్లు లేకుండానే మహాశివరాత్రి ఉత్సవాల పనులు అప్పగింత

ఈవో నిర్లక్ష్యం, దేవాదాయ శాఖ పర్యవేక్షణ లోపం






## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూన్ 19:**

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)--2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతా ధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ నెల 24వ తేదీలోగా శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం - మిగతా3లో






# యాప్‌లో యూరియా బుకింగ్ రైతులకు తలనొప్పి

నో స్టాక్ సందేశాలతో అయోమయం.. డీలర్ లాగిన్‌లపై అనుమానాలు

**అందోలు, జూన్ 19, (ప్రజాజ్యోతి):**

వ్యవసాయ సీజన్ కీలక దశలో ఉన్న సమయంలో యూరియా ఎరువుల బుకింగ్ ప్రక్రియ రైతులకు కొత్త ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా - మిగతా3లో



## సదాశివపేటలో పరిమళించిన మానవత్వం..

# పేద కుటుంబానికి మాజీ కౌన్సిలర్ అండ!

**పేద యువతి వివాహానికి ఫర్నిచర్ బహుమతి.. ఉదారత చాటుకున్న మాజీ కౌన్సిలర్ ఛాయా శాంతు!**

**కష్టాల్లో ఉన్న కుటుంబానికి కొండంత అండ.. పెళ్లి కానుకగా ఫర్నిచర్ సెట్ అందజేత!**

**మానవత్వం చాటుకున్న 14వ వార్డు మాజీ కౌన్సిలర్.. స్థానికుల ప్రశంసలు!**



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** సదాశివపేటలో మానవత్వం పరిమళించింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ పేద కుటుంబానికి స్థానిక మాజీ కౌన్సిలర్ అండగా నిలిచారు. పాత కేరి ప్రాంతానికి చెందిన ఓ యువతి వివాహానికి అవసరమైన ఫర్నిచర్‌ను బహుమతిగా అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. సదాశివపేట పట్టణంలోని పాత కేరి ప్రాంతానికి చెందిన నీరటి అమూర్తమ్మ కుమార్తె వివాహం ఈరోజు (19వ తేదీన) జరగనుంది. అయితే, ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉండటంతో పెళ్లి ఖర్చులకు సైతం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న 14 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఉల్లిగడ్డల ఛాయా శాంతు.. ఆ పేద కుటుంబానికి అండగా నిలవాలని సత్సంకల్పంతో ముందుకు వచ్చారు. వివాహం చేసుకోబోతున్న వధూవరులకు ఉపయోగపడేలా, ఆ కుటుంబానికి భారం తగ్గించేందుకు గానూ తన సొంత ఖర్చులతో కూతురి పెళ్లికి అవసరమైన ఫర్నిచర్ సెట్‌ను బహుమతిగా అందజేశారు. ?ఈ సందర్భంగా స్థానికులు మాజీ కౌన్సిలర్ ఛాయా శాంతు ఉదారత్వాన్ని అభినందించారు. ఆర్థిక సహాయం అందుకన్న పేద కుటుంబ సభ్యులు, కష్టకాలంలో తమను ఆదుకున్నందుకు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నీట్ (యూజీ)--2026 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూన్ 19:** జిల్లాలో ఈ నెల 21న (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

**అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి:**

ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు

ఆధార్ కార్డు / పాన్ కార్డు / పాస్‌పోర్ట్ / స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు

రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో

పారదర్శక (ట్రాన్స్‌పరెంట్) నీటి బాటిల్ మాత్రమే

**పాటించాల్సిన సూచనలు:**

అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం (మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలి

పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి

**నిషేధిత వస్తువులు:**

స్వంత పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తీసుకురావద్దు

ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు

అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం , బెల్ట్, ఆభరణాలు (ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి), ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్ప్‌నర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దు. పై పేర్కొన్న వస్తువులలో ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లు గుర్తిస్తే, అతడిని/ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ లేదా ఇతర నిషేధిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే, అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం రద్దు చేయబడటంతో పాటు, భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని, పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీట్ (యూజీ)--2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

## భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థాన నూతన ఈఓగా దేవనాధం





**అమీన్ పూర్(ప్రజాజ్యోతి)** బీరంగూడ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానం నూతన ఈఓగా దేవనాధం నియమితులయ్యారు,అయన శుక్రవారం దేవస్థానం పాలకవర్గం ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు, ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన ఈఓ దేవనాధంకు కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. దేవస్థాన పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తూ భక్తుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఈఓ శశిధర్ గుప్తను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, శషిధర్ గుప్త ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేసి మంచి గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. అదే విధంగా నూతన ఈఓ దేవనాధం అనుభవాన్ని వినియోగించి ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఆయన ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ఈఓ దేవనాధంకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





ఈ రోజు పుట్టిన పసి పిల్లలకు రూ.20 వేల ఫిక్సిడ్ డిపాజిట్..
జీహెచ్ఎంసీ కార్మికులకు నిత్యావసర కిట్లు పంపిణీ

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ముత్తంగి డివిజన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన పసికందుల భవిష్యత్ భద్రత కోసం ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఫిక్స్ డ్ డిపాజిట్ చెక్కులు అందజేస్తామని తెలిపారు, జీహెచ్ఎంసీ సఫాయి కార్మికులకు నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కేవలం కేక్ కటింగ్‌లకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడేలా నిర్వహించడం విశేషంగా నిలిచింది. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చే నిరుపేద కుటుంబాలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా పుట్టిన శిశువుల పేరున రూ.20 వేల ఫిక్స్డ్ డిపాజిట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు నీలం మధు తెలిపారు. ఈ నిర్ణయం పేద కుటుంబాలకు భవిష్యత్‌లో ఆర్థిక భరోసా కల్పించనున్నదని ఆయన తెలిపారు, అదే విధంగా పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న జీహెచ్ఎంసీ సఫాయి కార్మికులను ఘనంగా సన్మానించి, వారి కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. సమాజ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నీలం మధు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రేమ, ఐక్యత, సామరస్య విలువలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమాలు దేశ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పేదలు, కార్మికులు, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం ఆయన నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉన్నదని అన్నారు రాబోయే రోజుల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడతామని, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని నీలం మధు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్ లు కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుమ్మడిదలను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం.





-పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేసిన
: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**గుమ్మడిదల(ప్రజాజ్యోతి)** గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో 3.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి వివిధ కాలనీ ల్లో పర్యటించిన ఆయన అభివృద్ధి పనులను ప్రారంభించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు తాము ఎప్పుడు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రతి వార్డు అవసరాలను గుర్తించి దశల వారీగా నిధులు మంజూరు చేస్తున్నామని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించే నిధులతో పాటు స్థానిక పరిశ్రమల సహకారంతో (సీఎస్ఆర్) నిధులను కూడా వినియో గించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్ని వర్గాల సహకారంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు అనంతరం గుమ్మడిదలలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ భవనం సామాజిక కార్యక్రమాలు, సమావేశాలకు ఉపయోగపడటంతో పాటు సంఘ సభ్యులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వివిధ వర్గాల అభివృద్ధికి సంఘాల బలోపేతానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డుల కౌన్సిలర్ లు కో–ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

-మొదటిపేజీ తరువాయి

జూన్ 25వ తేదీ నుంచి బి ఎల్ ఓ లు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అన్ని స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించామని, జిల్లా స్థాయిలో కూడా మరో రెండు రోజుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామని, ఇంటింటి సర్వే సందర్భంగా బి ఎల్ ఓ లు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యం

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా॥ సిద్దం. ఉజ్వల్ రెడ్డి



**జహీరాబాద్, జూన్ 19( ప్రజా జ్యోతి న్యూస్ )** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా॥ సిద్దం ఉజ్వల్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఆయన స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి ఉత్సాహంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చారిత్రక పాదయాత్ర నిర్వహించారని గుర్తుచేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడటమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఏకైక లక్ష్యం కావాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, మున్సిపల్ చైర్మన్ యూనూస్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. నర్సింహా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, జాఫర్, రంగా అరుణ్, జమిలాలోద్దీన్, అక్రమ్, జావిద్, జహీంగీర్, నిజాం, అతిక్, సర్పంచ్‌లు నరేష్, బ్రహ్మానంద రెడ్డి, సీనియర్ నాయకులు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, మోతీరాం, హర్షవర్ధన్ రెడ్డిలతో పాటు జహీరాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల ఇంచార్జులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు, అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, జూన్ 19( ప్రజా జ్యోతి న్యూస్)** శుక్రవారం జహీరాబాద్ మండలం హోతి బి గ్రామంలో గ్రామ సర్పంచ్ మచ్చేందర్  జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణతో కలిసి ఇరవై లక్షలు గ్రామ పంచాయితీ నిధులు 10 లక్షలు యంజి ఎన్  ఆర్ ఇజిఎస్, నిధులు 10 లక్షలు మొత్తం ఇరవై లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు, అండర్ డ్రైనేజ్  నిర్మాణ పనులను ప్రారంభించి గ్రామస్తులకు మొక్కలను  పంపిణి చేసిన శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే  మాట్లాడుతూ... గ్రామంలోని వార్డులో అంతర్గత మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచు కుని, నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా ఈ పనులను పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేకుండా  నియోజకవర్గం గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో  మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ విజయ్  కుమార్ ఝరాసంఘం మండల బిఆర్ఎస్ పార్టీ  అధ్యక్షులు వెంకటేశం సర్పంచులు రాజు  సత్వార్, చేస్మొద్దీన్ శేఖపూర్, మోహన్ రాథోడ్ శేఖపూర్ తాండ శ్రీనివాస్ బూచినెల్లి, అరుణ్ కుమార్ కొత్తూరు, వెంకట్ గోవింద్ పూర్, భీం రావ్ హుగ్గెల్లి తాండ, మాజీ సర్పంచుటెట్లు  చిన్నారెడ్డి, అమీత్ కుమార్, రాజు, బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పర్వేజ్ పటేల్  హోతి బి, సహీద్ సత్వార్, వీర్ శెట్టి గోవింద్ పూర్ నాయకులు శ్రీకాంత్ ఉప సర్పంచ్ విష్ణు వార్డ్ సభ్యులు రాజు రాసప్ప చింటు జియా పటేల్ పారమ్మ రాజేందర్ బిఆర్ఎస్  కార్యకర్తలు మామూద్ సబ్ మోసిన్ డి రాజు కుమర్ అనిల్ ఇమ్మాన్యుయేల్ అశోక్ బాబర్ సబ్ ఆమెర్ ఇర్ఫాన్ దిలీప్ సంగయ్య జిలిల్ రబానీ మైబూబ్ బంటి దేవదాస్ కోరే ప్రభు బి నర్సింలు గ్రామ వార్డ్ మెంబర్ లు, ప్రజలు , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాప్‌లో యూరియా బుకింగ్ రైతులకు తలనొప్పి

-మొదటిపేజీ తరువాయి

బ్యాగులు బుక్ చేసుకోవాలని సూచించినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది రైతులు సాంకేతిక సమస్యలు, అవగాహన లోపం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ లేని రైతులు యూరియా బుకింగ్ ఎలా చేయాలో తెలియక ఎరువుల విక్రయ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు స్మార్ట్‌ఫోన్ ఉన్న రైతులు కూడా యాప్‌లో బుకింగ్ చేసేందుకు ప్రయత్నిస్తే “నో స్టాక్” అనే సందేశం మాత్రమే కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా అందోలు, చౌటకూరు, పుల్కల్ మండలాలలోని పలువురు రైతులు యాప్‌లో డీలర్ల జాబితాను పరిశీలించగా, అనేక ఎరువుల దుకాణాల వద్ద “బ్యాగ్స్ అవైలబుల్: జీరో.జీరో” అని చూపిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో అసలు యూరియా నిల్వలు లేవా? లేక యాప్‌లో సమాచారం సక్రమంగా అప్‌డేట్ కావడం లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల వాదన ప్రకారం, యాప్ ద్వారా బుకింగ్ అవకాశం కల్పించినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానం కొరత, యాప్ నిర్వహణలో లోపాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొంతమంది రైతులు గంటల తరబడి ప్రయత్నించినా బుకింగ్ పూర్తికావడం లేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, కొంతమంది ఎరువుల దుకాణాల నిర్వాహకులు డీలర్ లాగిన్‌ల ద్వారా ముందుగానే బుకింగ్‌లు చేసుకుని సాధారణ రైతులకు అందకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ పనులు ఊపందుకున్న తరుణంలో యూరియా కొరత లేదా పంపిణీ వ్యవస్థలో లోపాలు ఉంటే పంటలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉంచడంతో పాటు బుకింగ్ ప్రక్రియను సులభతరం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**రైతుల ప్రధాన డిమాండ్లు**

యూరియా నిల్వలపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి.
యాప్‌లో రియల్‌టైమ్ స్టాక్ వివరాలు అందుబాటులో ఉంచాలి.
స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు ప్రత్యామ్నాయ బుకింగ్ విధానం కల్పించాలి. డీలర్ లాగిన్‌ల వినియోగంపై పారదర్శక విచారణ చేపట్టాలి. రైతులకు మండల స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

# భూముల మార్కెట్ విలువలు తగ్గించాలి

## జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌కు నామ రవి కిరణ్ వినతి

**జహీరాబాద్, జూన్ 19(ప్రజా జ్యోతి న్యూస్)** ఇటీవల ప్రభుత్వం పెంచిన భూముల మార్కెట్ విలువలు జహీరాబాద్ పట్టణ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బహిరంగ మార్కెట్ విలువల కంటే ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలు భారీగా పెంచడంతో సామాన్యులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన మార్కెట్ విలువలను తక్షణమే పునఃపరిశీలించి, వాటిని తగ్గించా లని కోరుతూ జహీరాబాద్ పట్టణ ప్రజలు, బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, జిల్లా రిజిస్ట్రార్‌కు వినతి పత్రలు సమర్పించారు. ఈ సందర్భంగా నామ రవి కిరణ్ మాట్లాడుతూ... జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వెనుకబడిన ప్రాంతాలు, బస్తీల్లో నిబంధనలకు విరుద్ధంగా భూముల విలువలను పెంచారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నాల్ సాబ్ మొహల్లా, ఖాన్ మొహల్లా, సింగీతం మొహల్లా, బాగారెడ్డిపల్లి శివాలయం రోడ్డు లాంటి ప్రాంతాల్లో ఈ పెంపు తీవ్రంగా ఉంది. రాచన్నపేట్ సుభాష్ గంజ్ ప్రాంతంలోని కొన్ని బ్లాక్‌లలో ఏకంగా గజానికి రూ. 40 వేల వరకు విలువను నిర్ధారించడం గమనార్హం. అలాగే, గత ప్రభుత్వాలు ఇళ్లు లేని పేదలు, బలహీన వర్గాలకు సర్వే నెంబర్ 275 బాబు మోహన్ కాలనీ, ఫ్రూట్స్ కాలనీలో ఉచితంగా ఇంటి పట్టాలు పంపిణీ చేశాయి. కానీ, ఇప్పుడు ఆ ప్రాంతంలో కూడా భూమి ప్రస్తుత విలువలకూ పొంతన లేకుండా పోయిందని,



రిజిస్ట్రేషన్ ఛార్జీలు కట్టలేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దయచేసి ఉన్నతాధికారులతో చర్చించి, పెంచిన విలువలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని వారు జిల్లా రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణానికి చెందిన పలువురు నాయకులు, మాజీ కౌన్సిలర్ నామ రవి కిరణ్, నరేష్ రెడ్డి, చింతా మల్లికార్జున్, మహమ్మద్ ఖాజా, ఏక్ నాథ్, అజయ్ తదితరుల పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్‌కు నూతన గోదాం నిర్మాణానికి భూమిపూజ

**రాయికోడ్ జూన్ 19 (ప్రజా జ్యోతి):** మండలంలోని  వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన నూతన గోదాం నిర్మాణం కోసం అల్లాపూర్ గ్రామ శివారులో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.  ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ యం. సుధాకర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పాల్గొని గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రైతులకు పంటల నిల్వ సౌకర్యాలు మెరుగుపడేందుకు, మార్కెట్ యార్డ్‌లో మౌలిక వసతులు అభివృద్ధి చెందేందుకు ఈ గోదాం నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆలయ చైర్మన్ సతీష్ కుల్కర్ణి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్న పటేల్, మాజీ జెడ్పీటీసీ సుభాష్ పటేల్, మాజీ ఎంపీపీ బస్వరాజ్ పటేల్, మాజీ సర్పంచ్ కేదారనాథ్, పీఏసీఎస్ చైర్మన్ నాగశెట్టి, మండల అధ్యక్షులు బాలాజీ నర్సింలు, సర్పంచులు చరణ్, తుక్కారం, మాజీ సర్పంచ్ సతీష్, మార్కెట్ యార్డ్ కార్యాలయ సిబ్బంది, నాయకులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నూతన గోదాం నిర్మాణంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.



# తరగతి గదులు లేక విద్యార్థుల అవస్థలు






## ధనాసిరి ప్రభుత్వ పాఠశాల కాంగ్రెస్ ప్రభుత్వ విద్యా నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం

### ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం



**జహీరాబాద్, జూన్ 19(ప్రజా జ్యోతి న్యూస్) :** శుక్రవారం ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి పరిశీలించడం జరిగింది. ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ధనసిరి ఉన్నత పాఠశాల భవనాన్ని మూడు సంవత్సరాల క్రితం తొలగించి "మన ఊరు -- మన బడి" పథకం కింద రూ.1.45 కోట్లతో కొత్త భవనాన్ని మంజూరు చేశారు. కాంట్రాక్టర్ సుమారు రూ.90 లక్షల విలువైన పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. దీంతో సుమారు 180 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల గదుల్లోనే ఉన్నత పాఠశాల నిర్వహించ బడుతోంది. ఉదయం ప్రాథమిక పాఠశాల, మధ్యాహ్నం ఉన్నత పాఠశాల తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు తరగతి గదుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. అనడానికి ఈ దనసిరి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలనే నిదర్శనం. ప్రభుత్వం కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తు ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది ఒక పూట బడులతో విద్యార్థులు సక్రమంగా విద్యపై దృష్టి పెట్టి చదవలేక పోతున్నారు. టీచర్లు సమయ పాలన సరిపోక అనుకున్న మేరకు విద్యార్థులకు విద్యాబోధన చేయలేక బాధపడ్తున్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పడం కాదు స్వయంగా విద్యా శాఖను ముఖ్యమంత్రి తన వద్దే ఉంచుకొని ఈ విదంగా పేరుకే ఉన్నత పాఠశాల తరగతి గదులు లేకుండా పేద మధ్యతరగతి విద్యార్థులు వారి చదువు లను ఏకాగ్రతతో ఏ విదంగా కోనసాగిస్తారు. తరగతి గదులు లేని పాఠశాలలను నిర్వ హిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఈ ముఖ్య మంత్రికే దక్కింది. ఇప్పటికే తెలంగాణ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (+శీజవతీఅఎవత్ ూఎష్ట్రశీశీశ్రీ జుఅతీశీశ్రీశ్రీఎవత్) విషయంలో దేశంలో అత్యంత వెనుకబడిన రాష్టాలలో కింది నుండి రెండవ స్థానంలో నిలిచింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన "మన ఊరు -- మన బడి" కార్యక్రమం, లి గురుకుల విద్యాసంస్థలు లి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదపడ్డాయి. పేద, గ్రామీణ, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో గురుకులాలు కీలక పాత్ర పోషించాయి. అలాంటి విజయవంతమైన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేయడం బాధాకరం. అదే సమయంలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ విషయంలో కూడా అనేక సందేహాలు వ్యక్త మవుతున్నాయి. ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్న గురుకుల వ్యవస్థను బలోపేతం చేయకుండా కొత్త పేర్లతో వ్యవస్థలను తీసుకు రావడం వెనుక ప్రభుత్వ అసలు ఉద్దేశం ఏమిటో ప్రజలకు వివరించాలి. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో భారీ వ్యయాలు, భూసేకర ణలు, నిర్మాణాల విషయంలో అవినీతి, ఆర్థిక అక్రమాలపై వస్తున్న ఆరోపణల పై ప్రభుత్వం పూర్తి పారదర్శకత తో సమాధానం చెప్పాలి. అవసరమైతే స్వతంత్ర విచారణ జరిపించి నిజానిజాలను ప్రజల ముందుంచాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించ గా వంట సిబ్బంది బిల్లులు ఆలస్యంగా వస్తున్నా యని, అందుతున్న మొత్తాలు సరిపోవడం లేదని తెలిపారు. ఈ సమస్యను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ధనసిరి ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి పెండింగ్ బిల్లులు విడుదల చేసి పనులను పూర్తి చేయాలి. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన "మన ఊరు -- మన బడి" పనులను పునఃప్రారంభించి పూర్తి చేయాలి. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదు. పాఠశాలలు బలోపేతం కావాలి, గురుకులాలు అభివృద్ధి చెందాలి, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసం పెరగాలి. ధనసిరి పాఠశాలలో తరగతి గదులు నిర్మించి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాడుతాము. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి మాణిక్, మాజీ సర్పంచ్ శంకర్ నాయకులు యస్. గోపాల్, యం. మల్లేశం, చెంగల్ జైపాల్, పవన్ రాథోడ్, మేఘనాథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## జాతీయ మెగా లోక్అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



**మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 19:** మెదక్ జిల్లా న్యాయస్థానం పరిధిలో ఈనెల 20 తేదీన ఉదయం 10 గంటలకు జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయశాఖ చైర్పర్సన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తెలిపారు .శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ.. రాజీ పడదగిన కేసులన్నీ రాజకుదురుకొని సంతోషంగా ఉండాల న్నారు. ప్రతి మనిషిలో క్షేమ గుణం కలిగి ఉండాలన్నారు. రాజకు దురుచుకుంటే మానసిక ప్రశాంతత ఏర్పడుతుంద న్నారు. క్షణికావేశంలో పెట్టుకున్న కేసులన్నీ రాజకుదురుచుకుంటే ఇది వర్గాలు సంతోషంగా స్నేహపూర్వకంగా ఉండొచ్చు అన్నారు. భార్యాభర్తలు తగాదాలను పడితే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి రాజకీయం ద్వారా వారి భవిష్యత్తు బాగుం టుందన్నారు .మెదక్ జిల్లాలో నేటి వరకు సుమారు 3వేల కేసులు రాజీ కుదిర్చినట్లూ తెలిపారు.రేపు మెగా జాతీయ లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరిస్తామ న్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఫస్ట్ ఎడిషనల్ కోర్టు జడ్జ్ శ్రీమతి సుబవల్లి , జిల్లా న్యాయ అధికార సంస్థ కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## కార్యదర్శి అంజయ్య సేవలను గ్రామ ప్రజలు మర్చిపోరు

### గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్



**కొల్చారం (ప్రజాజ్యోతి ) జూన్ 19 :** పంచాయతీ కార్యదర్శి అంజయ్య గ్రామంలో అందించిన విశిష్ట సేవలు చేపట్టిన అబి వృద్ధి పనులు మరువలేనివని వక్తలు కొనియాడారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి అంజయ్య బదిలీపై వెలుతున్న సందర్బంగా సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా సర్పంచ్ దేవన్న గారి శేఖర్, మాజీ సర్పంచ్ రాజగౌడ్, జూలకంటి సంఘమేశ్వర్ లు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు స్థానచలనం తప్పదని పేర్కొన్నారు. అంజయ్య సేవలను కొల్చారం గ్రామ ప్రజలు మర్చిపోరని కార్యదర్శి గా తన విధులను ఎంతో చాకచక్యంగా నిర్వహించిన అతను బదిలీలో భాగంగా వెళ్లడం తమకెంతో తీరని లోటు అన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా వారికి తెలిపిన వెంటనే అతి తొందరగా స్పందించి గ్రామ ప్రజల సమస్యలను తీర్చేవారన్నారు. తాను ప్రజల సేవలు కోరే మంచి మానవత్వం ఉన్న మహానుభావుడని ఆయన లాంటి కార్యదర్శులు ప్రతి గ్రామంలో ఉంటే గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

**మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 19:** విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం బడావత్ రాఘవేందర్, హవేళీఘనపూర్ మండలం పోచంరాల్ తండాకు చెందిన విద్యార్థి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బూరుగుపల్లిలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని, బీసీ హాస్టల్లో నివసిస్తూ విద్యను అభ్యసించాడు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించినం దుకు, జిల్లా డీఆర్డీఏ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ కాలేజెస్ (బ్యాక్ ) పథకం ద్వారా హైదరాబాద్ బోడుప్పల్ లోని ఎస్.ఆర్. జూనియర్ కళాశాలలో ఉచిత సీటు పొందాడు. ప్రభుత్వ సహకారంతో ఇంటర్మీడి యట్ విద్యను విజయవం తంగా పూర్తి చేశాడు. తెలంగాణ (ఈఏపీసెట్ ) పరీక్షల్లో సుమారు 2000 లోపు ర్యాంకుసాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించి, జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షల్లో కూడా మంచి ప్రతిభ కనబరి చాడు. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ వారణాసి (బి హె చ్ యు ) లో కంప్యూటింగ్ అండ్ మ్యాథమెటిక్స్ బ్రాంచ్లో ప్రవేశం పొందాడు. ఈ సందర్భంగా విద్యార్థి నేడు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశాడు.కలెక్టర్ మారుమూల గ్రామం నుంచి ఐఐటీ వారణాసి వరకు అతని విద్యా ప్రస్థానాన్ని అభినందిస్తూ, ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం తరపున అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చదువును ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని, విద్య ఒక మనిషిని ఉన్నత స్థానాల కు తీసుకెళ్తుందని విద్యార్థికి సూచించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ అంబాదాస్ రాజేశ్వర్ , జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు ఏఎస్ఓ నవీన్, జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి మురళీమోహన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూరుగుపల్లి ప్రధానోపా ధ్యాయులు రమేష్ మరియు రాఘవేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక చింతన తోనే పరమాత్ముని చేరుతాం





**శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి**

**అయ్యప్ప ఆలయం లో వైభవంగా అష్టోత్తర శతకలశ స్థాపన**

**మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 19 :** ఆలయ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక అయ్యప్పదేవాలయంలో స్వామి మూలవిరాట్ మూర్తికి ఫలపంచామృత మహాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేట మదనానంద పీఠాధీశ్వరు లు మాధవానంద సరస్వతీ స్వామి కరకముల చేత ఈక్రతువు కొనసాగగా, ఆలయ గోపుర శిఖరానికి భక్తులు అభిషేకం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అష్టోత్తర శతకలశ స్థాపన పూజ నిర్వహించారు. అనంతరం మాధవానంద సరస్వతీ స్వామి నవగ్రహా లు, ఆంజనేయస్వామి, శివలింగానికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామి గర్భగుడిలోని అయ్యప్పస్వామి మూల విరాటు ఫలపంచామృత మహాభిషేకం నిర్వహిం చగా, అదే సమయంలో ఆలయశిఖరానికి అనంతసాగర్ సరస్వతీ క్షేత్ర ధర్మాధికారి అష్టకాల విద్యామనోహరశర్మ, గురుస్వామి హరిదాస్, ఆలయ సేవకులు వైద్య రాజు, వేదపండితులు, భక్తులు అభిషేకం చేశారు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అయ్యప్ప స్వామిని దర్శించుకు న్నారు. ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి ఆలయ శిఖరానికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**రథయాత్ర**

వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రథయాత్రను నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవవిగ్రహాన్ని రథంపై



అలంకరించి.. పట్టణ పురవీధులగుండా ఊరేగించారు. కేరళ వాయిద్యం, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి స్థానిక ఆలయం వద్ద ప్రారంభమైన రథయాత్ర మార్కెట్, జేఎన్రోడ్డు, రాందాస్ చౌరస్తా, ఎంజీ రోడ్డు, పాతబస్టాండ్ మీదుగా కొనసాగింది. సాయంత్రం ఆలయంలో లలిత, విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు వైద్యశ్రీనివాస్, వైద్యమణికంఠ, అశోక్, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక, మాజీ చైర్మన్లు భట్టిజగపతి, మల్లికార్జున్ గౌడ్, చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ఆలయ బాధ్యులు వీర్ కుమార్ , రామాంజనేయులు, చక్రపాణి, కొండ శ్రీనివాస్, వెంకట్ నారాయణ, ఉప్పల శ్రీనివాస్, పార్థివనాథ్ రాజు, రమేశ్ ,రాజన్ పాల్గొన్నారు.

## కాబోయే ప్రధాని రాహుల్ గాంధీనే

**ఘనంగా అగ్రనేత రాహుల్ జన్మదిన వేడుకలు**



**మెదక్ (ప్రజాజ్యోతి) జూన్ 19:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం భారత భావి ప్రధాని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద గుల గంగాధర్ ఆధ్వ ర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయక త్వం ఎంతో అవసరమని న్యాయ గ్యారంటీలతో పేదలకు భరోసా కల్పించిన ప్రజా నాయకుడు అని కొనియాడారు. వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి యువతను ఏకం చేసిన మహానేత రాహుల్ గాంధీ ఆయన నాయకత్వంలోనే దేశానికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. మందుగుల. భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం పై పోరాటం చేస్తూ ఈ దేశానికే దశా దిశా నిర్దేశం చేస్తున్నటువంటి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిందిగా ప్రజలందరిని ఏకం చేస్తూ పోరాటాలు చేస్తున్నటువంటి మహా గొప్ప నేత రాహుల్ గాంధీ ని ఈ దేశానికి ప్రధానమంత్రిగా కావాలని దేశ ప్రజలందరూ కూడా కోరుకుంటున్నారని అది నెరవేరుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సి పల్ చైర్మన్ కానుగపు కానుగు రాధికా భూపతి రాజు , వైస్ చైర్మన్ దొంతి నరేష్ , పట్టణ పార్టీ అధ్యక్షులు మందూగుల గంగాధర్ , బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హఫీజ్ మోల్సాబ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొజ్జ పవన్ , మేడం బాలకృష్ణ , కౌన్సిలర్లు. గంట సంపత్ , శివరామకృష్ణ , ఎరుకల నరసింహులు , హరిత నర్సింగ్ రావు గారు, శశాంక్ , మెదక్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు భరత్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఓమర్ , మాజీ కౌన్సిలర్ గుండేటి శేఖర్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అమీర్ నాయకు లు సిద్ధ రాములు , నవీన్ , దేవుల నాయక్ , జాయి ముర్రే , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు విస్తరణ పనులు...

**టి జి ఐ ఐ సి వత్తాస్తునే నిర్లక్ష్యం అంటున్న ప్రజలు**



**మనోహరాబాద్, జూన్ 19 ( ప్రజా జ్యోతి )** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని టీజీఐఐసి ప్రాంతం నుంచి నూతనంగా ఏర్పడ్డ కొండాపూర్ పారిశ్రామిక వాడల్లోకి రోడ్డు విస్తరణ వెడల్పులో కాంట్రాక్టర్ జాప్యంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇదిలాగా ఉంటే రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తు న్న కాంట్రాక్టర్ మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాడని పలువురు విమర్శిస్తున్నారు. 20 ఫీట్ల రోడ్డుకి ఇంత ఆలస్యం ఎందుకని పలువురులో సందేశాలు మొదలవుతున్నాయి ఇలాగే ఉంటే ప్రమాదాల బారిన పడిన వారికి ఎవరు బాధ్యత అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా సరే కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని పలువురు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

**ఝరాసంగం :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయం అభివృద్ధి కుంటుపడుతున్నది. ఆలయానికి ఏడాదికి సుమారు రూ.4 కోట్ల ఆదాయం వస్తున్నా, అధికారులు దాదాపు అంతే మొత్తంలో ఖర్చులు చూపిస్తున్నారు. కానీ, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధికి, ఆ ఆదాయానికి పొంతన లేదని, అభివృద్ధి పేరుతో నిధులు పక్కదారి పట్టిస్తున్నారని సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆలయంలో కనిపిస్తున్న అంతర్గత షెడ్లు, వెలుపల నిర్మించిన షెడ్లు, గ్రానైట్ ఫ్లోర్లింగ్ వంటి ఇతర పనులన్నీ భక్తులే సొంత డబ్బులతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయించారని, ఆలయ నిధుల ద్వారా, పాలకమండలి ద్వారా జరిగిన అసలైన అభివృద్ధి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈవో స్థానిక నాయకులు, కొన్ని ఇతర శక్తుల నుంచి వస్తున్న రాజకీయ, సామాజిక ఒత్తిళ్లకు తలొగ్గి సొంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక బంధుత్వాలు, ఒత్తిళ్ల కారణంగానే ఆలయ ప్రయోజనాలను పక్కనపెట్టి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతోనే ఆలయ అభివృద్ధి కుంటుపడిందని విమర్శలు ఉన్నాయి. గత మహాశివరాత్రి జాతర సందర్భంగా ఆలయ రథం గోపురం (శిఖరం) ఊడిపోయి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ, దానికి కొత్తది ఏర్పాటు చేసే ప్రయత్నం కానీ, మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని భక్తులు మండిపడుతున్నారు. కనీసం తాత్కాలిక ఏర్పాట్లు కూడా చేయకుండా రథాన్ని అలాగే వదిలేశారని ఆరోపిస్తున్నారు.

**ఊసేలేని టెండర్ల ప్రక్రియ**

ఏటా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వివిధ రకాల పనులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచేవారు, కానీ.. ప్రస్తుత ఈవో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి టెండర్లు వేయలేదని, దాని వెనుక ఉన్న మతలబు ఏమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో కొందరిని నిబంధనలకు విరుద్ధంగా నియమిస్తున్నారని, దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్‌కు స్వయంగా ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేయక పోవడంతో పాటు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

గతంలో కూడా ఆలయంలో జరుగుతున్న అక్రమాలపై విసుగు చెందిన కొందరు భక్తులు ఆలయ ఈవో, అర్చకులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖకు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. స్థానిక నాయకుల అండదండలతో ఆలయంలో దళారులు, అనధికార పూజారులు భక్తులపై దౌర్జన్యాలకు దిగుతూ గూండాయిజం చేస్తున్నారని, అభిషేకాలు, అర్చనలు, వాహన పూజలు, గుండం స్నానాల వద్ద ఎలాంటి రసీదులు ఇవ్వకుండా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. గతంలో మాజీ ఎంపీటీసీ ఆరోపించినా, కనీసం వారిపై చర్యలు కూడా తీసుకోలేదన్నారు. ప్రస్తుతం కేతకీ ఆలయానికి గ్రేడ్-2 స్థాయి ఈవో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండటంతో పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, ఆలయ అభివృద్ధి దృష్ట్యా ఈవో తీరుపై సమగ్ర విచారణ జరిపి, ఆలయ గ్రేడ్‌కు అనుగుణంగా పూర్తిస్థాయి గ్రేడ్-1 రెగ్యులర్ ఈవోను నియమించినప్పుడే, కేతకీ క్షేత్రం అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని భక్తులు, నాయకులు అంటున్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆలయ సమగ్రాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# హక్కుల సాధన కోసం పోరాడుతా




**కరీంనగర్ :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబడ్దార్. గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి ఓడించాం. మళ్లీ అదే పునరావృతమైతే వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం" అంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆమె మాస్ వార్నింగ్ ఇచ్చారు.బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు.అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడు తూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ... కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు."అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు. మ్యాన్ చైర్ మీద 45 నిమిషాల పాటు ప్రయాణించడం వల్ల కార్మికులు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. సింగరేణిలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. జేఎంఐటీ లో ఉన్న వారికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను సింగరేణి కార్మికులను కలవకుండా ఉండేందుకు గత నాలుగు రోజులుగా పోలీసులు ఆంక్షలు పెడుతూ అడ్డుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసలు సింగరేణి పరిధిలోకి పోలీసులకు అనుమతే లేదని, గేట్ మీటింగ్‌కు వస్తే కార్మికుల జీతాలు కట్ చేస్తామని యాజమాన్యం బెదిరించడం దుర్మార్గమన్నారు. ఒక్క కార్మికుడి జీతం కట్ చేసినా తాను ఇక్కడే గని ముందే ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.